క్లుప్తంగా...

నేడు వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలు

రాజేంద్రనగర్: తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దశాబ్దిఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు రాజేంద్రనగర్ సర్కిల్ వైద్య, ఆరోగ్య శాఖ సంఘం సభ్యులు ఓ ప్రకటనలో తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని సామభూపాల్‌రెడ్డి గార్డెన్‌లో ఉదయం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, రంగారెడ్డి జిల్లా డీఎంహెచ్‌ఓ, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ, ప్రజాప్రతినిధులు, ఆయా ప్రాంతాల్లోని ప్రభుత్వ ఆసుపత్రుల డాక్టర్లు, నర్సులు, ఉద్యోగులు పాల్గొంటారన్నారు.

స్వర్ణభారత్ ట్రస్టు ఉచిత శిక్షణ

శంషాబాద్ రూరల్: మండలంలోని ముచ్చింతల్ శివారులోని స్వర్ణ భారత్ ట్రస్టు ఆవరణలో వివిధ అంశాలపై ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు. సీసీటీవీ కెమెరా, సెక్యూరిటీ అలారం, స్మోక్ డిటెక్టర్ కోర్సుల్లో 13 రోజుల పాటు శిక్షణ ఇవ్వనున్నట్లు వివరించారు. ఈనెల 15 నుంచి తరగతులు ప్రారంభంకానున్నాయి. 19 నుంచి 45 ఏళ్లున్న వారు శిక్షణకు అర్హులు కాగా.. ఉచిత శిక్షణతో పాటు వసతి, భోజన సౌకర్యాలు కల్పిస్తామని నిర్వాహకులు తెలిపారు.

రెండోరోజు కొనసాగిన తనిఖీలు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలో రవాణాశాఖ అధికారులు రెండోరోజు మంగళవారం స్కూల్ బస్సులను తనిఖీలు చేశారు. మోటర్ వాహనాల చట్టానికి విరుద్ధంగా ఉన్న రెండు వాహనాలను సీజ్ చేశారు. సోమవారం నుంచి స్కూల్స్ ప్రారంభం కావడంతో రంగారెడ్డి జిల్లా రవాణా శాఖ కమిషనర్ ప్రవీణ్‌రావు ఆదేశాల మేరకు స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్నారు. బస్సుల్లో ఫస్ట్ ఎయిడ్‌కిట్‌లతో పాటు ఫిట్‌నెస్, ఫైర్ ఎగ్జిట్ తదితర పరికరాలను పరిశీలిస్తున్నారు. బస్సు డ్రైవర్ లైసెన్స్‌తో పాటు వయస్సు, బస్ పర్మిట్, ఆర్సీ, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లను సరిచూస్తున్నారు. రవాణాశాఖ అధికారులు మాట్లాడుతూ.. 60 ఏళ్లు దాటిన డ్రైవర్లను నియమించొద్దని పాఠశాలల యజమానులకు సూచిస్తున్నారు. పిల్లలను తరలించే బస్సులకు తప్పనిసరిగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఉండాలన్నారు. పర్మిట్‌లేని వాహనాలను సీజ్ చేస్తామన్నారు.

బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడికి మాతృవియోగం



పాడె మోస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు చంద్రారెడ్డి తల్లి పార్వతమ్మ (90) మంగళవారం తెల్లజామున మృతిచెందారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, సీనియర్ నాయకులు మున్సిపల్ వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, నార్సింగి ఏఎంసీ చైర్మన్ వెంకటేష్‌గౌడ్, సీనియర్ నాయకులు గణేష్‌గుప్తా, సుల్తాన్‌పల్లి సర్పంచ్ ఇస్తారి, నాయకులు నీరటిరాజు, శ్రీనివాస్‌గౌడ్, వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు చంద్రారెడ్డిని పరామర్శించి నివాళులర్పించారు.

హ్యాకథాన్‌లో సత్తా చాటిన ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు

రూ.50వేల నగదు పురస్కారం, సర్టిఫికెట్లు



ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ బృందానికి సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ విద్యార్థులు హ్యాకథాన్‌లో మొదటి స్థానంలో నిలిచారని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఇటీవల నిర్వహించిన హ్యాకథాన్‌లో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని 'ఎకో ఛాంపియన్స్' బృందంలో పీహెచ్‌డీ విద్యార్థులు ఎం రాజేష్, ఎం సతీష్‌కుమార్, టి థామస్‌డేవిడ్ సమర్థవంతమైన నీటి నిర్వహణపై తక్కువ ధర ఐఓటీ- ఆధారిత సెన్సార్‌కు రూ.50వేల నగదు పురస్కారం అందించారు. మురుగునీటి శుద్ధి, పునర్వినియోగం కోసం తక్కువ ధర సాంకేతికత, తక్కువ ఖర్చుతో కూడిన కమ్యూనిటీ రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ టెక్నాలజీ, వ్యవసాయ, పారిశ్రామిక, ఇతర నీటి ఇంటెన్సివ్ రంగాలలో మంచినీటి డిమాండ్‌ను తగ్గించడానికి వినూత్నమైన శక్తి సామర్థ్య, ఆర్థిక పరిష్కారాల వంటి థీమ్‌కు సంబంధించిన ఆలోచనలను టీఎస్‌పీసీబీ ఆహ్వానించింది. ఇందులో ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు సమర్థవంతమైన నీటి నిర్వహణ పరిష్కారాన్ని అందించడంతో వారికి మొదటి స్థానం లభించింది. వీరికి రాష్ట్ర దేవాదాయశాఖ మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి చేతుల మీదుగా పురస్కారాన్ని అందించారు.

అన్ని రంగాల్లో మహిళల అభివృద్ధి



వేడుకలను ప్రారంభిస్తున్న ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్



స్టాల్స్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

బండ్లగూడ: తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తరువాతే సీఎం కేసీఆర్ హయాంలో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారని చేవెళ్ల ఎంపీ డాక్టర్ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌లు అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో ఘనంగా రాష్ట్ర అవతరణ దినోత్సవ వేడుకలను నిర్వహించారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మంగళవారం బండ్లగూడలోని జీఆర్‌కే గార్డెన్‌లో మహిళా సంక్షేమ దినోత్సవ సంబరాలను నిర్వహించారు. ఈ సంబరాల్లో మహిళలు పెద్దఎత్తున తరలివచ్చారు. ముఖ్య అతిథులుగా ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మహిళా సంక్షేమ దినోత్సవ సంబరాలను ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుతో మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్నారన్నారు. మహిళా సంక్షేమానికి దేశంలో మరే ఇతర రాష్ట్రాలు ప్రవేశపెట్టని విప్లవాత్మక పథకాలు, కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళల ఆరోగ్య పరిరక్షణ, భద్రతకు వారు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రత్యేక ప్రోత్సాహకాన్ని ఇస్తుందన్నారు. ఆర్డీఓ చంద్రకళ, బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ రేఖాయాదగిరి, కార్పొరేషన్ బీఆర్‌ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, జడ్పీటీసీ తన్వీరాజు, ఎంపీపీ జయమ్మ, కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మహిళా సంఘాలు, ఆశవర్కర్లు, మహిళా ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



హాజరైన మహిళా సంఘాల సభ్యులు, ప్రజలు

ఘనంగా దేవాలయ వార్షికోత్సవాలు



వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న దేవాలయ కమిటీ సభ్యులు



విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని పోచమ్మ తల్లి దేవాలయ వార్షికోత్సవాలు మంగళవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. దేవాలయ కమిటీ అధ్యక్షులు ఉమారెడ్డి, ప్రధాన కార్యదర్శి కె.గణేష్‌ల ఆధ్వర్యంలో దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా వివిధ రకాల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశారు. తెల్లవారుజామునే అభిషేకం, కుంకుమార్చన, లలితాపారాయణం తదితర పూజా కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

రెండో రోజుకు చేరిన ప్రతిష్ఠాపనోత్సవాలు..

- రాజేంద్రనగర్ డివిజన్ ఉప్పర్‌పల్లిలో నిర్వహిస్తున్న విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు మంగళవారం రెండో రోజుకు చేరాయి. సాయినాథ స్వామి, గణపతి, దత్తాత్రేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు నిర్వహిస్తున్నారు. సామ రాజ్‌పాల్‌రెడ్డి, సామ ఇంద్రపాల్‌రెడ్డిలు దేవాలయాన్ని నిరిర్మించగా.. ఉప్పర్‌పల్లి శ్రీ వీరాంజనేయ భక్త సమాజం ఆధ్వర్యంలో మంగళవారం తెల్లవారుజాము నుంచే దేవాలయంలో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. ప్రజలు పెద్ద ఎత్తున కార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

మణికొండ: నార్సింగి మార్కెట్ రోడ్డులో నిర్మించిన గండమ్మ, పోచమ్మ అమ్మవార్ల ప్రతిష్ఠాపన పూజలు మంగళవారం ఘనంగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య అమ్మవార్ల విగ్రహాలు, యంత్రాలను ప్రతిష్ఠించారు. అనంతరం పెద్ద ఎత్తున భక్తులకు అన్నదాన వితరణ చేశారు. నార్సింగి మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్, కౌన్సిలర్ లక్ష్మీప్రవళిక కిరణ్‌కుమార్‌లతో పాటు భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపన పూజల్లో పాల్గొన్న వైస్‌చైర్మన్, కౌన్సిలర్లు



హోమం చేస్తున్న భక్తులు

పోలీసులకు సన్మానం



మైలార్‌దేవ్‌పల్లి ఇన్‌స్పెక్టర్‌కు మెమొంటో అందజేత

రాజేంద్రనగర్: కరోనా సమయంలో తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా కుటుంబాలకు దూరంగా విధులు నిర్వహించిన పోలీసుల సేవలు అమోఘమని సంఘ సేవకుడు మహ్మద్ ఖాదర్ అన్నారు. మంగళవారం సోషల్ వర్కర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మైలార్‌దేవ్‌పల్లి పోలీసులను ఘనంగా సన్మానించి మెమొంటోలను అందజేశారు. ఇన్‌స్పెక్టర్ మధుతో పాటు ఎస్సైలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులకు ప్రశంసాపత్రాలతో పాటు మెమొంటోలను ప్రదానం చేశారు. ఖాదర్ మాట్లాడుతూ.. లాక్‌డౌన్ సమయంలో పోలీసులతో పాటు వైద్య, ఆరోగ్య, మున్సిపల్, జలమండలి, విద్యుత్ తదితర విభాగాలకు చెందిన వారంతా తమ ప్రాణాలను సైతం లెక్క చేయకుండా విధులు నిర్వహించారన్నారు. రోజుల తరబడి కుటుంబాలకు దూరంగా ఉంటూ సేవలు అందించారన్నారు. వారిని తమ సొసైటీ తరఫున సన్మానించామన్నారు.

మన దేశానికి అందం మన సాంప్రదాయాలే

బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొ.ధీరేంద్రకుమార్‌రాయ్



మాట్లాడుతున్న ప్రొఫెసర్ ధీరేంద్రకుమార్‌రాయ్

రాయదుర్గం: మనదేశానికి అందం మన సాంప్రదాయాలేనని బనారస్ హిందూ యూనివర్సిటీ ప్రొఫెసర్ ధీరేంద్రకుమార్‌రాయ్ పేర్కొన్నారు. మంగళవారం అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని మనూలో 'యోగా ఫర్ హ్యూమానిటీ' అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు సంప్రదాయాలతో బాటు యోగాను కూడా వదిలివేశామన్నారు. ఇప్పుడిప్పుడే దీనికి ప్రపంచవ్యాప్తంగా ప్రాధాన్యత పెరుగుతోందన్నారు. హర్యానా కర్నాల్‌కు చెందిన యోగా గురువు డాక్టర్ సరితకుమార్ యోగా, సంగీతంపై అవగాహన కల్పించారు. యోగా, సంగీతం ఈ రెండింటి ద్వారా శ్వాసను నియంత్రించవచ్చన్నారు. మరో గురువు డాక్టర్ రష్మీ సింగ్ మాట్లాడుతూ యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, జీవన విధానమన్నారు. యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వీసీ సయ్యద్ ఐనుల్ హసన్, స్కూల్ ఆఫ్ ఎంసీజే డీన్ ప్రొఫెసర్ మహ్మద్ ఫరియాద్, డాక్టర్ అశ్విని, డాక్టర్ ఫిర్దోస్ తబస్సుమ్, అధ్యాపకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

16న చందానగర్‌లో జాబ్ మేళా

గచ్చిబౌలి: నిరుద్యోగ యువత కోసం జీహెచ్‌ఎంసీ సహకారంతో లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ జాబ్ మేళ నిర్వహిస్తున్నట్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చందానగర్‌లోని ఎంఎంటీఎస్ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న లైట్ హౌస్ స్కిల్లింగ్ సెంటర్‌లో 16న ఉదయం 11 గంటలకు జాబ్ మేళ ప్రారంభమవుతుందన్నారు. రిటైల్, బ్యాంకింగ్, లాజిస్టిక్స్, ఫార్మసీ, సేల్స్, ఐటీ, నాన్ ఐటీ తదితర విభాగాలలో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ, బీటెక్, పీజీ తదితర విద్యార్హతలున్న వారు హాజరుకావచ్చు. అభ్యర్థులు ఆధార్‌కార్డులు, రెజ్యూమ్‌లు 3 సెట్‌లు తీసుకురావాలని, వివరాల కోసం 8688100660 నంబర్‌లో సంప్రదించవచ్చు.

'బీఆర్‌ఎస్ అహంకారానికి గుణపాఠం చెప్పాలి'



కాసోజు మల్లేష్‌చారి

రాజేంద్రనగర్: బీఆర్‌ఎస్ ప్రభుత్వం బీసీల మధ్య చిచ్చు పెట్టేందుకే లక్ష రూపాయల లోన్‌ను ముందుకు తీసుకొచ్చిందని బీజేపీ రాజేంద్రనగర్ డివిజన్ ఓబీసీ మోర్చా అధ్యక్షులు కాసోజు మల్లేషచారి ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీసీలంతా ఈ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 9 ఏళ్లలో బీసీలకు రాష్ట్ర ఏమీ చేయలేదన్నారు. ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు సరైన గుణపాఠం చెప్తామన్నారు. తెలంగాణ ఉద్యమంలో కుటుంబసభ్యులను కోల్పోయి చాలా మంది అనాథలు అయ్యారన్నారు. బీసీలందరికీ ఈ లోన్‌లను వర్తింపజేయాలని కోరారు. లేనిపక్షంలో వచ్చే ఎన్నికల్లో ఒక్కరు కూడా బీఆర్‌ఎస్‌కు ఓటు వేయరని అభిప్రాయపడ్డారు.

ప్రభుత్వ భూమిని విక్రయించిన వ్యక్తిపై కేసు

శంషాబాద్: ప్రభుత్వ భూమిని సొంత ప్లాటు అని నమ్మించి ఓ కుటుంబాన్ని మోసం చేసిన వ్యక్తిపై ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. సిద్ధాంతికి చెందిన సున్నం రాజు (40) ఎయిర్‌పోర్టు కాలనీలోని ప్రభుత్వానికి చెందిన ఎంఐజీ ప్లాటు 106 తనదిగా నమ్మించి ఆర్‌బీనగర్‌లో నివసించే నక్క శ్రీలత, శ్రీరాములు దంపతుల నుంచి కొంత కాలం క్రితం రూ. 3 లక్షలు తీసుకున్నాడని సమాచారం. డబ్బులు చెల్లించిన దంపతులు ప్లాటు గురించి ఆరా తీయడంతో అది ప్రభుత్వ స్థలమని తేలింది. దీంతో వారు మోసపోయినట్లు గ్రహించి ఇంటికి వెళ్లి తిరిగి డబ్బులు ఇవ్వాల్సిందిగా కోరారు. డబ్బులు తిరిగి ఇవ్వకపోగా.. సదరు వ్యక్తులపై కుక్కలను వదిలేయడం, కొట్టడం, బెదిరింపులకు పాల్పడినట్లు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. నిందితుడు గతంలో కూడా ప్రభుత్వ స్థలాలను తన సొంత స్థలాలుగా పేర్కొంటూ.. విక్రయించిన కేసులు నమోదైనట్లు సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువతి అదృశ్యం



చైతన్య (ఫైల్)

శంషాబాద్: యువతి అదృశ్యమైన ఘటన ఆర్‌జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సాతంరాయి కూలీ పనులు చేసుకుంటూ నివసించే గొరప్ప చిన్న కుమార్తె చైతన్య (18) సమీపంలో ఉన్న అమ్మమ్మ ఇంటికి వెళ్తున్నట్లు చెప్పి ఈనెల 12 మధ్యాహ్నం ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు తెలిసిన చోట వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'6 నెలలలోపు వాహనాలు తీసుకెళ్లాలి'

రాయదుర్గం: సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో స్వాధీనం చేసుకున్న 1,197 వాహనాలను మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ గ్రౌండ్‌లో ఉంచామని సైబరాబాద్ పోలీసులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ వాహనాల వివరాలను వెబ్‌సైట్ www.cyberabad police.gov.in లో పొందుపరిచారు. ఇందులో మీ వాహనం ఉన్నట్లయితే సంబంధిత పోలీస్‌స్టేషన్ ఎస్‌హెచ్‌ఓను కలిసి వాహనం డాక్యుమెంట్లను సమర్పించి తీసుకెళ్లాలని సూచించారు. 6 నెలల కాల పరిమితిలోపు సంప్రదించాలని, లేనట్లయితే ఆ వాహనాలను వేలం వేస్తామని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. మరిన్ని వివరాలకు ఎంటీఓ ఎస్ విష్ణు సెల్ నంబర్ 9490617317లో సంప్రదించాలి.

నకిలీ సంఘాలను సృష్టించిన రిసోర్స్ పర్సన్‌పై కేసు

- బోగస్ పత్రాలతో రెండు బ్యాంకుల్లో రూ.34 లక్షల రుణాలు
- నకిలీ స్టాంపులు సంతకాలు
- ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసిన మున్సిపల్ కమిషనర్

శంషాబాద్: నకిలీ మహిళా స్వయం సహాయక సంఘాలను సృష్టించిన రెండు బ్యాంకుల నుంచి రూ. 34 లక్షల రుణాలు పొందిన రిసోర్స్ పర్సన్‌తో పాటు ఆమెకు సహకరించిన ఉద్యోగిపై శంషాబాద్ మున్సిపల్ కమిషనర్ భోగీశ్వర్లు ఫిర్యాదు మేరకు ఆర్‌జీఐఏ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని ఆర్‌బీనగర్‌లో నివాసం ఉండే కె.రత్న (40) స్వయం సహాయసంఘాలకు సంబంధించిన రిసోర్స్ పర్సన్‌గా గత కొన్నేళ్లుగా పనిచేస్తోంది. పట్టణంలోని కాపుగడ్డ తదితర బస్తీలకు చెందిన నాలుగు స్వయంసహాయక సంఘాలకు చెందిన గ్రూపుల్లో ఉన్న సభ్యులకు తెలియకుండా వాటిలోనే ఇతరుల ఫొటోలు చేర్పించింది. నకిలీ సంతకాలు చేసి గ్రూపు సభ్యులకు తెలియకుండా పట్టణంలోని రెండు బ్యాంకుల నుంచి రూ. 34 లక్షల రుణం తీసుకుని సొంతానికి వాడుకుంది. బ్యాంకు అధికారులు గ్రూపులోని అసలు సభ్యులకు ఫోన్లు చేసి రుణాలు చెల్లించాల్సిందిగా సూచించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. రిసోర్స్‌పర్సన్‌తో పాటు వీటిని పర్యవేక్షించే మరో అధికారి హన్మంతురెడ్డి కూడా రిసోర్స్‌పర్సన్ చేసిన మోసాల్లో భాగస్వామిగా ఉన్నట్లు సమాచారం. దీనిపై జిల్లా అదనపు కలెక్టర్ ఆదేశాల మేరకు గత కొన్ని రోజులుగా చేపట్టిన అధికారులు పరిశీలనలో వెల్లడైంది. మున్సిపాలిటీకి సంబంధించిన నకిలీ స్టాంపులు కూడా తయారు చేసి ఫోర్జరీ సంతకాలు సైతం చేసినట్లు పరిశీలనలో తేలింది. వీటితో పాటు మరికొన్ని సంఘాల నుంచి కూడా వీరిద్దరు రుణాల కోసం అధికారుల సంతకాల పేరిట వసూళ్లకు పాల్పడినట్లు కమిషనర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు మంగళవారం ఆర్‌జీఐఏ పోలీసులు రిసోర్స్ పర్సన్ రత్న, అధికారి హన్మంతురెడ్డిలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తమ వ్యవసాయ విస్తరణ పరిశోధకులకు అవార్డులు



అవార్డులను అందుకుంటున్న రచయితలు, పీహెచ్‌డీ విద్యార్థులు

ఏజీవర్సిటీ: రాజేంద్రనగర్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్ (మేనేజ్)లో ఉత్తమ వ్యవసాయ విస్తరణ పరిశోధకులకు అవార్డులను ప్రదానం చేశారు. సహజ వ్యవసాయ పద్ధతులు, రైతులకు ప్రత్యక్ష ప్రయోజనాల బదిలీ, వ్యవసాయ యూట్యూబర్‌లు, కూరగాయలలో మార్కెటింగ్, సామాజిక పర్యావరణ పరిరక్షణ వ్యవసాయం, తదితర విభాగాల్లో పుస్తకాలు రాసినవారికి పీహెడీ విద్యార్థులు, పండితులు, రచయితలకు ప్రథమ, ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు.ఈ సందర్భంగా మేనేజ్ డైరెక్టర్ చంద్రశేఖర మాట్లాడుతూ.. వ్యవసాయ విస్తరణలో పరిశోధనలను జాతీయ ప్రాధాన్యతల వైపు మళ్లించాలన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అనువర్తిత పరిశోధనాలపై దృష్టిసారించాలన్నారు. ఎన్ బాల సుబ్రమణి సిబ్బంది పాల్గొన్నారు.

రూ.10 లక్షలతో అభివృద్ధి పనులు



పనులను ప్రారంభించిన వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలోని అన్ని వార్డుల పరిధిలోని వీధుల్లోని రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లను అభివృద్ధి చేస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ వెంకటేష్‌యాదవ్ అన్నారు. మంగళవారం ఆయన 16వ వార్డులో రూ.10 లక్షలతో సీసీరోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మున్సిపాలిటీ కేంద్రం నార్సింగిలో రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు ప్రస్తుత జనాభాకు సరిపోవటం లేదన్నారు. నిధులను లభ్యతను బట్టి పనులను చేపడుతున్నామన్నారు.

పీహెచ్‌సీలో మెరుగైన వైద్య సేవలు

శంషాబాద్ రూరల్: మండలంలోని పెద్దషాపూర్ పీహెచ్‌సీని నేషనల్ క్వాలిటీటీ అష్యూరెన్స్ స్టాండర్స్ పథకానికి ఎంపిక చేయడంతో వైద్యసేవలు మరింత మెరుగుపడతాయని ఎంపీటీసీ చెక్కల ఎల్లయ్య అన్నారు. కేంద్ర బృందం రెండు రోజులుగా ఆస్పత్రిలో వసతులు, వైద్యసేవలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేసిందన్నారు. ఈ పథకానికి ఎంపిక కావడంతో ఏటా ఆసుపత్రికి అదనపు నిధులు వస్తాయన్నారు. పథకానికి పీహెచ్‌సీ ఎంపికయ్యేందుకు స్థానిక సర్పంచ్ చంద్రశేఖర్, ఎంపీటీసీ ఎల్లయ్య సహకరించారని డాక్టర్ ప్రభాకర్ ప్రకటించారు.



పీహెచ్‌సీ సిబ్బందితో కేంద్ర బృందం సభ్యులు

కేంద్ర సుపరిపాలనను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్‌ఎస్ ప్రభాకర్

శంషాబాద్: కేంద్ర సుపరిపాలనను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ఎస్ ప్రభాకర్ మోర్చాలకు పిలుపునిచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్‌యాదవ్ అధ్యక్షతన నియోజకవర్గ మోర్చాల సదస్సును మంగళవారం మల్లికా కన్వెన్షన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రధాని నరేంద్ర మోదీ 9 ఏళ్లలో సాధించిన దేశ ప్రగతిని అడుగడుగునా.. ప్రతి ఒక్కరికీ వివరించాలన్నారు. రైతులను ఏ విధంగా ఆదుకుంటున్నారో చెప్పాలన్నారు. ఆయుష్మాన్ భారత్‌తో ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలను వివరించాలన్నారు. రాష్ట్రంలో నడుస్తున్న కుటుంబపాలన విషయాన్ని ప్రజలకు వివరించాలన్నారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొచ్చేందుకు మోర్చాలు కష్టపడాలని సూచించారు. బీజేపీ రంగారెడి జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర నాయకులు డాక్టర్ ప్రేమ్‌రాజ్, అంజన్‌కుమార్‌గౌడ్, మల్లారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చింతల నందకిశోర్‌గుప్తా, బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భైతి శ్రీధర్, ఎస్సీసెల్ రాష్ట్ర నాయకులు కె. ప్రశాంత్, చంద్రయ్య, మహేందర్, దేవేందర్ తదితరులున్నారు.



శ్మశానవాటిక కబ్జా!



శ్మశానవాటికలో ప్రహరీ నిర్మించిన దృశ్యం

రాజేంద్రనగర్: మైలార్‌దేవ్‌పల్లి లక్ష్మీగూడ దళితుల శ్మశానవాటిక పక్కన ఉన్న ప్రభుత్వ స్థలాన్ని కాపాడాలని స్థానికులు కోరుతున్నారు. సమాధులను కబ్జా చేస్తూ.. ప్రహరీలను నిర్మిస్తున్నా.. రాజేంద్రనగర్ రెవెన్యూ అధికారులు స్పందించడం లేదని ప్రజలు వాపోతున్నారు. శ్మశానవాటికతో పాటు పక్కనే ఉన్న ప్రభుత్వ స్థలంలో యదేచ్ఛగా నిర్మాణాలు సాగుతున్నాయని దీనిపై రాజేంద్రనగర్ ఆర్డీఓ, ఎమ్మార్వో ఈ విషయంపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలంటున్నారు. లక్ష్మీగూడ సర్వేనెంబర్ 52లో ప్రభుత్వ స్థలం ఉంది. కాగా గతంలో ఈ స్థలంలోని కొంత స్థలాన్ని దళితుల శ్మశానవాటిక కోసం కేటాయించారు. కొందరు కబ్జాదారులు ప్రస్తుతం ప్రభుత్వ స్థలంతో పాటు శ్మశనవాటిక స్థలంలో ప్రహరీలను నిర్మిస్తున్నారని సమాధులను సైతం పెకిలించి కబ్జా చేస్తున్నారనే విమర్శలున్నాయి. స్థానికులు రెవెన్యూ సిబ్బందికి ఫిర్యాదు చేసినా.. పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి కబ్జాల నుంచి శ్మశానవాటిక స్థలాన్ని కాపాడాలని కోరుతున్నారు.